ఒత్తిడిని అధిగమిస్తే విజయమే

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి
- ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరైతే ఉత్తమ ఫలితాలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

కర్నూలు సిటీ: పది పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే పరీక్షలు అంటే సహజంగా ఒత్తిడి ఉంటుంది. అయితే ఈ ఒత్తిడిని జయిస్తే పరీక్షల్లో విద్యార్థులు సులువుగా విజయం సాధిస్తారు. విద్యార్థులు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి. ఒకవేళ భయానికి గురైతే పరీక్ష రాసేటప్పుడు చదివినదంతా మరిచిపోయే ప్రమాదం ఉంది. ఈ భయం కారణంగా గందరగోళంతో కూడిన జవాబులు రాసే అవకాశాలే అధికం. కాబట్టి భయానికి చెక్ పెట్టాలంటే ముందు తల్లిదండ్రులు విద్యార్థులకు కావాల్సిన ధైర్యాన్ని నూరిపోయాలి. వారి మీద ఎక్కువ ఒత్తిడి పెట్టకూడదు. విద్యార్థులు ఒత్తిడికి గురైతే దాని ప్రభావం వారి ఆరోగ్యంపైనా కనిపిస్తుంది. దీంతో వారు పరీక్షలు సరిగా రాయలేరు. కాబట్టి పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులను ఒత్తిడికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీదే ఉంది. పిల్లల పట్ల సున్నితంగా మెలుగుతూ, ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరైతే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి!

ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలకు జిల్లాలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 32,760 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఏడాదిపాటు నేర్చుకున్న పాఠాలను, వాటి ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని ప్రదర్శించి మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులకు పరీక్షలు ఒక అవకాశం. కొందరు ప్రణాళికబద్ధంగా పరీక్షలకు సిద్ధపడితే, చాలా మంది సిలబస్ మొత్తం చదివినా పరీక్షల్లో సరిగా రాయగలమా లేదోననే ఆందోళనతో సతమతమవుతుంటారు. ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులను తల్లిదండ్రులు గుర్తించి, వారికి పలు సూచనలు, సలహాలు ఇవ్వాలి. పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి.

- పరీక్షలకు సన్నద్ధం అయ్యే సమయంలో విద్యార్థులు పదే పదే బయటికి పోకుండా చూసుకోవాలి. టీవీలు, సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి
- చదువుతున్న పిల్లలను అబ్జర్వ్ చేస్తూ, వేళకు వారితో పాటే కూర్చొని భోజనం చేయాలి. అతిగా ఆహారం తీసుకోకుండా చూసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే సమతుల ఆహారం ఇవ్వాలి.
- చదువుకునే పరిసర ప్రాంతాల్లో ఎలాంటి శబ్దాలు, ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి.
- రీడింగ్ రూంలో స్వచ్ఛమైన నీటిని అందుబాటులో ఉంచాలి. ఆ గదిలో సరైన వెలుతురు, గాలి దారాళంగా వచ్చేలా ఉంటే విద్యార్థులు ఉత్సాహంగా ఉంటారు.
- కాఫీ, టీ, కూల్‌డ్రింక్స్ వంటి పానీయాలకు దూరంగా ఉంచడమే మేలు. వీటిని తరుచూ తాగడం వల్ల శరీరంలో కెఫిన్ మోతాదు పెరిగి ఆలోచనల్లో స్పష్టత లోపిస్తుంది. ఒత్తిడికి గురి కాకుండా బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయించాలి.
- సరైన నిద్ర, పౌష్టికాహారం, ప్రణాళికా బద్ధమైన రివిజన్ విద్యార్థులు చేసేలా తల్లిదండ్రులు చూసుకోవాలి.
- అరగంట ముందే పరీక్షా కేంద్రం వద్ద ఉంటే మంచిది.

మామూలు పరీక్షల్లాగానే రాయాలి



పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకూడదు. మాములు రోజుల్లో రాసేపరీక్షల మాదిరే రాసేందుకు వెళ్లాలి. పరీక్షలు జరుగుతున్న రోజుల్లో ఆత్మ విశ్వాసం అనేది చాలా ముఖ్యం. పిల్లల ఆరోగ్యం పట్ల పేరెంట్స్ చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల్లో విద్యార్థులు ముందుగా తెలిసిన వాటికి సమాధానాలు రాయాలి. ఆ సమయంలో ఏవైనా జ్ఞప్తికి రాకపోతే ఆందోళన చెందకుండా..తెలిసిన వాటిన్నింటిని రాసిన తరువాత మిగిలిన వాటి గురించి ఆలోచించాలి.

– డా.కె వేణుగోపాల్, టిస్ట్ పరీక్షల ప్రత్యేకాధికారి


పది పరీక్షలకు సర్వం సిద్ధం

పాణ్యం: నేటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పాణ్యం మండలంలో మొత్తం 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 1,015 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నట్లు ఎంఈఓ కోటయ్య తెలిపారు.

కోడుమూరు రూరల్: మండలంలో కోడుమూరు బాలురు, బాలికల హైస్కూళ్లు, మోడల్ స్కూల్, లద్దగిరిలోని హైస్కూలులో ఏ,బీ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ అనంతయ్య తెలిపారు. ఈ 5 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1173 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని ఆయన వెల్లడించారు.

సి.బెళగల్: మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో సి. బెళగల్‌లోని జెడ్పీ హైస్కూల్, మోడల్ హైస్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలతో పాటు కొత్తకోట జెడ్పీ హైస్కూలు ఉన్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 961 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు.

కల్లూరు: మండలంలోని అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 3,417 మంది విద్యార్థులు ఆయా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, అయితే, విద్యార్థులు అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులు వెంట హాల్‌టికెట్‌తో పాటు పరీక్ష సామగ్రి పెన్ను, పెన్సిల్ తెచ్చుకోవాలన్నారు.


సి.బెళగల్ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న దృశ్యం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్
- 1472 పొదుపు గ్రూపులకు ఆసరా మెగా చెక్కు అందజేత

కర్నూలు (న్యూటౌన్): మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరం మాసమసీదులోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. డీఆర్‌డీఏ – ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం) అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరై మాట్లాడారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 95శాతం నెరవేర్చారన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామని చెప్పారు. ప్రజా రంజక పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుని సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కర్నూలు మండలంలోని 1,472 పొదుపు గ్రూపులకు రూ.8,75,78,246 ఆసరా చెక్కు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మాలాలి, సొసైటీ చైర్మన్లు శేషిరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, వ్యవసాయ మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ విద్యాసాగర్, ఉప సర్పంచ్ మల్లశివుడు, సచివాలయ కన్వీనర్లు చిన్న లక్ష్మన్న, మోహన్‌బాబు, భాస్కర్, కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు, వెలుగు సీసీలు పాండు, రాముడు, నరసమ్మ, మహబూబ్‌బాషా, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

యోగా ఫెస్టివల్ విజేతలకు సన్మానం

కర్నూలు (టౌన్): బెంగళూరు అంతర్జాతీయ యోగా ఫెస్టివల్‌లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం సన్మానించారు. ఇటీవల రాజస్థాన్‌లో నిర్వహించిన 47వ జాతీయ స్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో 6వ స్థానంలో నిలిచిన జిల్లా క్రీడాకారిణి లాలన ప్రియకు అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి నగదు ప్రోత్సాహం అందజేశారు. కాగ పతకాలు సాధించిన వారిలో 20 నుంచి 25 ఏళ్ల మహిళల విభాగంలో ఎస్.ప్రసన్న (మొదటి స్థానం), 8 నుంచి 10 సంవత్సరాల బాలికల విభాగంలో మనుశ్రీ (మూడవ స్థానం), కృష్ణప్రియ (5వ స్థానం), కేనిషా (ఆరవ స్థానం), 8 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన బాలుర విభాగంలో వి.చతుర్వేది (ఆరవ స్థానం), 25 నుంచి 35 సంవత్సరాల పురుషుల విభాగంలో కె.మునిస్వామి (నాలుగవ స్థానం) ఉన్నారు.

భక్త జన సందడి

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాదిమంది ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. మూలపెద్దమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ తలారి చిన్నన్న, ఈఓ మోహన్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


మూల పెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: ఎదురుపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ పెద్దల సమక్షంలో అంతరాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి బైరపోగు సుంకన్న బ్రదర్స్ ఎద్దులు మొదటి బహుమతి రూ.30,016, అనంతపురం వీరన్నపల్లి గ్రామం నుంచి చెన్నారెడ్డి రెండో బహుమతి రూ.20,016, నంద్యాల జిల్లా ఎస్.కొత్తపల్లికి చెందిన నేతుల వెంకటేశ్వర్లు మూడో బహుమతి రూ.15,016 గెలుచుకున్నాయి. గిడ్డయ్యనాయుడు, శ్రీనివాసులు వృషభాలు నాల్గవ బహుమతి రూ.10,016, బోయ హేమంత్ ప్రసాద్ ఎద్దు ఐదో బహుమతి రూ. 6016, భాస్కరరెడ్డి ఆరో బహుమతి రూ.5016, యగాల నరసయ్య ఏడో బహుమతి రూ.4016, మంగలి బాబు వృషభాలు ఎనిమిదో బహుమతి రూ.2016 దక్కించుకున్నాయి.


బండలాగుతున్న వృషభాలు

నేడు స్పందన కార్యక్రమం

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతులు అందజేయవచ్చునని ఆయా మండలాల రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఆదివారం 550 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 505 క్యూసెక్కులనీరు విడుదల చేశారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో ప్రతిసోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి సూచించారు ముడుచుకుపోయిన కాళ్లు, చేతులకు బాల్, ప్యాడ్స్‌పై వైద్యులు వ్యాయామం చేయిస్తారన్నారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులు, బధిరులకు ఐఈఆర్‌టీ పరికరాలతో విద్యనందిస్తారని తెలిపారు.

పరిహారం ఇవ్వాలి

పాణ్యం: తమకు ముందుగా పరిహారం ఇచ్చి పనులు చేసుకోవాలని పిన్నాపురంలో ఓ రైతు నిరసనకు దిగారు. ఆదివారం గ్రీన్‌కో సంస్థ చేపడుతున్న కరకట్ట పనుల్లో గ్రామానికి చెందిన ఎల్లసుబ్బయ్యకు ఐదు ఎకరాల సాగు భూమి ఉంది. సదరు భూమికి ముందుగా పరిహారం ఇచ్చి పనులు చేసుకోవాలని పొలం వద్దనే కుటుంబ సభ్యులతో కలిసి సుబ్బయ్య నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సుధాకర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రైతుతో మాట్లాడారు. తర్వాత కంపెనీ ప్రతినిధులతో చర్చించి రైతుతో దీక్షను విరమింపజేశారు.

పది విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు

కర్నూలు(రాజ్‌విహార్): పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం రెండు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కర్నూలు–2డిపో మేనేజరు బి.సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విన్నపం మేరకు ఈ నెల 3వ తేదీ నుంచి కర్నూలు నుంచి సుంకేసుల మీదుగా కొత్తకోటకు ఉదయం 8 గంటలకు బస్సు బయలుదేరి తిరిగి పరీక్షల అనంతరం కర్నూలుకు వస్తుందని, సి.బెళగల్, గుండ్రేవుల, కొత్తకోట రూటులో మరోవిద్యార్థి బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బస్సుల్లో ఎదైనా ఇబ్బందులు ఎదురైతే సెల్ 73828 71131, 99592 25794 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సేవాగుణం కలిగి ఉండాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు సేవాగుణం కలిగి ఉండాలని డాక్టర్ మధుసూదన వర్మ అన్నారు. చిదంబరావు వీధిలోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలలో ఆదివారం అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం 29వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా భారతి ద్వారా జరుగుతున్న విద్య వైద్య సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. వసతి గృహం అధ్యక్షులు చిరంజీవిరెడ్డి, సేవా భారతి అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 1994లో ప్రారంభించిన వసతి గృహం దాతల సహకారంతో ముందుకు సాగుతుందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు చాలా మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ప్రధాన వక్త ఓలేటి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో వసతి గృహం కార్యదర్శి బాలాజీ రావు, కోశాధికారి బచ్చు సుబ్రహ్మణ్యం, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం

- వాల్మీకుల కృతజ్ఞతా ర్యాలీలో కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్


వాల్మీకుల కృతజ్ఞతా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వాల్మీకి నేతలు

కర్నూలు (న్యూటౌన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోసారి గెలిపించుకుందామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ వాల్మీకులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే తన నివాసం వద్ద వాల్మీకుల కృతజ్ఞతా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజకీయంగా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆయనకు అండగా నిలబడాల్సిన బాధ్యత వాల్మీకులపై ఉందన్నారు. ప్రదర్శనలో వాల్మీకి నాయకులు దస్తగిరి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, లక్ష్మణ్, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలుకు తరలి వెళ్లిన వాల్మీకులు

సి.బెళగల్/గూడూరు: కర్నూలులో ఆదివారం చేపట్టిన కృతజ్ఞత ర్యాలీకి కోడుమూరు నియోజకవర్గం నుంచి వాల్మీకులు భారీగా తరలివెళ్లారు. సి. బెళగల్ మండలంలో ఎంపీపీ బొంతల మునెప్ప ఆధ్వర్యంలో పలువురు వాల్మీకులు, మండల నాయకులు తరలివెళ్లారు. అలాగే గూడూరు నుంచి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎల్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోయ లక్ష్మన్న, కేడీసీసీ డైరెక్టర్ పత్తి రంగడు, మునుగాల సర్పంచ్ రామాంజనేయులు, ఆర్. ఖానాపురం సర్పంచ్ మునుస్వామి, చనుగొండ్ల, వై.కానాపురం నాయకులు, స్థానిక వాల్మీకి సంఘ నాయకులు వాహనాల్లో కర్నూలుకు బయలుదేరారు.

సీపీఆర్‌తో ప్రాణాలను నిలపొచ్చు


కోర్సు అభ్యసించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ అశోక్, డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని విజయవాడకు చెందిన అనెస్తెటిస్ట్, బీఎల్‌ఎస్ ట్రైనర్ డాక్టర్ వై.అశోక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండురోజులుగా స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న బీఎల్‌ఎస్ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బేసిక్ లైఫ్ సపోర్ట్ కోర్సులో భాగంగా సీపీఆర్ ఎలా నిర్వహించాలనే దానిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర కల్కూర, డాక్టర్ శ్రీలత, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కామద ఏకాదశి వేడుకలు

కర్నూలు కల్చరల్: స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం కామద ఏకాదశి వేడుకలు నిర్వహించారు. హరే కృష్ణ హరే రామ నామ జపం సామూహికంగా పఠించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సంధ్యా హారతి, తులసి హారతి, రాజభోగ నివేదన చేశారు. అనంతరం ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు ప్రవచనం చెప్పారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


సి.బెళగల్‌లో ఈత మట్టల ఊరేగింపులో చిన్నారులు

కల్లూరు: క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఈత మట్టలు పట్టుకుని ఆయా చర్చిల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా చర్చిల ఫాదర్లు ప్రకాష్‌బాబు, వినయ్‌కుమార్, లూర్దయ్య, కిషోర్, ఆయా చర్చిల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సి బెళగల్: మండలంలో మట్టల ఆదివారాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఏబీఎం చర్చిలో క్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు గేయాలను ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక ఏబీఎం చర్చి రెవ.రవికుమార్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం నిర్వహించారు. సంఘ పెద్దలు రాజశేఖర్, కిషోర్, సుందరరాజు, రాజు, దేవదానం, దాసు, కె. దేవదానం, దేవరాజు, పి.దానం , సుంకన్న, శామ్సన్, పెద్ద దానమన్న, తదితరులు పాల్గొన్నారు.


మట్టలతో గూడూరు పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

క్లుప్తంగా

కొత్తూరులో న్యాయమూర్తుల పూజలు


న్యాయమూర్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కర్నూలు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, నందికొట్కూర్ జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు పూజలు చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో అధికారులకు స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందించారు. శేషవస్త్రాలతో సన్మానించారు. ఈఓ రామకృష్ణ, ఆలయ అధికారులు సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లబకాష్ ఉరుసు


కిస్తీ బండిని ఊరేగిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు శివారులో హజరత్ అల్లబకాష్ మియావలి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడో రోజు ఆదివారం సాయంత్రం జియారత్ కిస్తీలు నిర్వహించారు. దర్గా గురువులు ఎస్ఎండీ మహబూబ్ బాషా నివాసం నుంచి అన్నప్రసాదాన్ని ఎద్దుల బండిపై పెట్టుకుని ఊరేగింపుగా దర్గా వరకు తీసుకెళ్లారు. అనంతరం స్వాముల వారి దర్గాకు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు స్వామికి కాయ చక్కెరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ ఉపసర్పంచు మాదులు

కోడుమూరు రూరల్: వేసవి దృష్ట్యా కోడుమూరులోని పాతబస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ స్టేట్ కమిటీ సభ్యులు సంధ్య విక్రమ్‌కుమార్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం సాయంత్రం గ్రామ ఉపసర్పంచు మాదులు ప్రారంభించి మాట్లాడారు. ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు సంధ్య విక్రమ్‌కుమార్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రాఘవేంద్ర, లింగన్న, డిష్ రవి, లక్ష్మన్న, నాగార్జున, లింగమయ్య, లాజర్, శివరాముడు, వెంకటశివుడు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళ సిబ్బంది

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనలో బాధిత రైతు బోయ నడిపి మాదన్నకు రూ. 80 వేల వరకు నష్టం వాటిల్లింది. కాగా మాదన్న చుట్టు పక్కలవాళ్ల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూ కోడుమూరు అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు హుటాహుటిన చేరుకుని ఆ మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఓర్వకల్లు: స్థానిక పొదుపు భవన్ ప్రాంగణంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సమాఖ్య వ్యవస్థాపకురాలు విజయభారతి పర్యవేక్షణలో సర్వజన ఫౌండేషన్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 370 మంది మహిళలు వైద్య సేవలు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాజేష్, డాక్టర్. అనీష్, పూర్ణ సందీప్, డాక్టర్. రవళి తదితరులు పాల్గొన్నారు.